క్లుప్తంగా

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న ఫౌండేషన్ సభ్యులు

రణస్థలం: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా స్వీకరించి పుట్టిన రోజున కచ్చితంగా మొక్కలు నాటి సంరక్షించాలనే సంప్రదాయాన్ని పిల్లలకు బాల్య దశ నుంచే అలవాటు చేయాలని హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సొసైటీ వ్యవస్థాపకులు ఆర్.హరిబాబు అన్నారు. శనివారం హరిత ఫౌండేషన్ సభ్యుడి కుమార్తె పుట్టిన రోజు సందర్భంగా సంచాం అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్ల మొక్కలు ఎవరికైనా ఉచితంగా కావాలంటే హరిత సొసైటీ సభ్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యుడు తవిటినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ

జి.సిగడాం: రైతులకు సకాలంలో విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. శనివారం జి.సిగడాం మండల పరిషత్ కార్యాలయం వద్ద రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో త్వరలో జరిగే యోగా దినోత్సవానికి భారీగా జనాలు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.సరిత, ఎంపీడీఓ జి.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కల్లేపల్లిలో పారిశుద్ధ్య పనులు



చెత్త తొలగిస్తున్న కార్మికులు

శ్రీకాకుళం రూరల్: కల్లేపల్లిలో శనివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పూడికలు తొలగించారు. పంచాయతీ సర్పంచ్ గంగు నరేంద్రకుమార్ పర్యవేక్షించారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



ఎమ్మెల్యేను కలిసిన సిరిమాను కమిటీ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలో సిరిమాను సంబరం అత్యంత వైభవంగా నిర్వహించడంలో సహకరించిన ఎమ్మెల్యే గొండు శంకర్‌కు సిరిమాను కమిటీ సభ్యులు శనివారం కృతజ్ఞతలు తెలిపారు. అనుపోత్సవం నాడు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అధికారులకు తగు సూచనలు జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు డి.పి.దేవ్, నక్క శంకరరావు, మావూరు శేఖర్, కల్లేపల్లి సోంబాబు, కర్రి రంగాజిదేవ్ పాల్గొన్నారు.

వెంకన్నకు విశేష అలంకరణ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు వేంకటేశ్వరస్వామి దేవాలయాలలో శనివారం స్వామి వారికి విశేష పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. పీఎన్ కాలనీలోని ఉత్తరాంధ్ర తిరుమల కొండగా పేరుపొందిన నారాయణ తిరుమలలో వేంకటేశ్వరుని ఆలయంలో అష్టోత్తర శతనామాలతో పూజలు నిర్వహించారు. వేంకటరామానుజ సేవాదళం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామిని పూలమాలలతో అలంకరించి అర్చనలు చేశారు. మొండేటివీధిలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. సామూహిక విష్ణు సహస్రనామ పారాయణలు జరిగాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



సంఘటన స్థలంలో యువకుడి మృతదేహం

రణస్థలం: విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న యువకుడు పత్తివాడపాలేం జాతీయ రహదారి వద్ద గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు లావేరు మండలంలోని చిగురుకొత్తపల్లికి చెందిన సీహెచ్ సాయి(24)గా గుర్తించారు. మృతుడు విశాఖపట్నంలోని ఒక బైక్ షోరూమ్‌లో పనిచేస్తుంటాడు. జేఆర్ పురం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేశారు. ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

సమ్మెలో సిబ్బంది..
సేవలకు ఇబ్బంది!

- 31 రోజులుగా మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది సమ్మె
- వీధి లైట్లు, తాగునీటి సరఫరాకు అంతరాయం
- అరకొరగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- ప్రజాసమస్యలు పట్టించుకోని ప్రభుత్వం



మోకాళ్లపై కూర్చుని నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది

శ్రీకాకుళం : మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇంజినీరింగ్ సిబ్బంది నిరవధిక సమ్మె నగర ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గత 31 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. ప్రత్యామ్నాయ సిబ్బందితో ప్రజలకు అరకొరగానే సేవలు అందుతున్నాయి. పలు వీధుల్లో తాగునీటి సరఫరా సక్రమంగా జరగటంలేదు, ప్రధాన రహదారుల్లో సైతం వీధి దీపాలు వెలగకపోవటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. సుమారు 40 మంది వరకు ఇంజనీరింగ్ సిబ్బంది సమ్మెలో ఉన్నారు. వీరికి సెక్యూరిటీ గార్డులు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఇంతర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మద్దతు ఇస్తున్నారు. వీధి దీపాలు, తాగునీటి పైపులైన్లు మొరాయిస్తే మరమ్మతులు చేసే దిక్కు లేకుండాపోయింది.

ప్రభుత్వ తీరుపై మండిపాటు..

ఇంజినీరింగ్ సిబ్బంది నెల రోజులుగా నిరాహార దీక్షలు, ధర్నాలు వంటి ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నా ప్రభుత్వం వీరి సమస్యలపై దృష్టి సారించడం లేదు. వారం రోజుల క్రితం చర్చలకు పిలిచినప్పటికీ చర్చలు సఫలం కాలేదు. రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పంతాలకు పోతోంది తప్ప ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉద్యోగ విరమణ చేసిన వారితో పాటు ప్రైవేటు వర్కర్లను ప్రత్యామ్నాయ సిబ్బందిగా నియమించారు. వీరికి ప్రస్తుత నగర స్థితిగతులు తెలియకపోవటంతో, సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులంత సంఖ్యలో వీరు లేకపోవడంతో ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలు అందటం లేదు. మరోవైపు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఉద్యోగులు గురువారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. మోకాళ్లపై నిలబడి వారి నిరసన తెలిపారు. శనివారం సైతం దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా సమ్మెలో ఉన్నవారు మాట్లాడుతూ తాము న్యాయమైన డిమాండ్ల కోసం పోరాటం చేస్తుంటే ప్రభుత్వం పరిష్కరించటం లేదన్నారు. ఇళ్ల వద్ద తమ కుటుంబాలకు ఆర్థాకలితో ఉంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ సిబ్బందితో..

రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్ ఉద్యోగులు సమ్మెలో ఉన్నారు. ప్రత్యామ్నాయ సిబ్బందితో ప్రజలకు ఇబ్బంది లేకుండా సేవలు అందించేలా పర్యవేక్షణ చేస్తున్నాం. ఒకటి రెండు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని ఆశిస్తున్నాం. సమస్యలు ఉంటే ప్రజలు నేరుగా తమకు తెలియజేయాలి.

– కామేశ్వరరావు, సూపరింటెండెంట్ ఇంజినీర్, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్

ఆలిండియా స్థాయిలో మెరిసిన..
అరసవల్లి కుర్రాడు

- నీట్ ఫలితాల్లో 64వ ర్యాంకు సాధించిన పొదిలాపు అవినాష్
- వెల్లువెత్తిన అభినందనలు

శ్రీకాకుళం న్యూకాలనీ: అరసవల్లి సమీపంలో నివాసంటున్న పొదిలాపు అవినాష్ నీట్ యూజీ–2025 ఫలితాల్లో సత్తాచాటాడు. శనివారం వెలువడిన ఫలితాల్లో ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 64వ ర్యాంకు సాధించాడు. 720 మార్కులకుగాను 652 మార్కులు సాధించి రాష్ట్రంలో టాప్ 5 జాబితాలో చోటు దక్కించుకోవడంతోపాటు శ్రీకాకుళం జిల్లా నుంచి ఆల్‌టైం రికార్డు సృష్టించి జిల్లాకు గర్వకారణంగా నిలిచాడు. ఎంతోమంది విద్యార్థులకు ఆదర్శంగా నిలిచాడు. అరసవల్లి ఖాజీపేటకు వెళ్లేదారిలో నివాసముంటున్న పొదిలాపు శ్రీనివాసరావు, భారతి దంపతుల కుమారుడే అవినాష్. తండ్రి మెడికల్ బిజినెస్ చేస్తుండగా, తల్లి గృహిణి. చెల్లి అవంతిక ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది.

చదువులో ఆణిముత్యం..

అవినాష్ 1 నుంచి 5వ తరగతి వరకు గీతాంజలి స్కూల్, 6 నుంచి 10వ తరగతి వరకు విజయనగరంలోని కోరుకొండ సైనిక్ స్కూల్‌లో చదివాడు. డాక్టర్ కావాలనే కలను సాకారం చేసుకునేందుకు విజయవాడలోని గోశాలలో శ్రీచైతన్య జూనియర్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్‌లో చేరి బైపీసీ పూర్తిచేశాడు. రెండేళ్ల ప్రణాళికాబద్ధంగా చదివి ఆలిండియా ఓపెన్ కేటగిరి స్థాయిలో 64వ ర్యాంకు సాధించడంతో అభినందనలు వెల్లువెత్తున్నాయి.

సంతోషంగా ఉంది..



నీట్ యూజీ–2025 ఫలితాల్లో ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 64వ ర్యాంకు సాధించడం సంతోషంగా ఉంది. తల్లిదండ్రులు, ఫ్యాకల్టీ ప్రోత్సాహం మరువలేనిది. నిరుపేదలకు అండగా ఉంటూ డాక్టర్‌గా సేవలు అందించాలనేది నా కోరిక.

– పొదిలాపు అవినాష్, 64వ ర్యాంకర్

ఆనందంగా ఉంది..



మా కుమారుడు నీట్ ఫలితాల్లో ఆలిండియా ఓపెన్ కేటగిరిలో జాతీయస్థాయిలో 64వ ర్యాంకు సాధించడం ఆనందంగా ఉంది. కష్టపడి చదివాడు. మంచి ర్యాంకు సాధించాడు. సైనిక్ స్కూల్‌లో టెన్త్ వరకు చదివి క్రమశిక్షణను అలవర్చుకున్నాడు.

– శ్రీనివాసరావు, భారతి(తల్లిదండ్రులు)

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు 31 రోజులు నిరవధిక దీక్ష చేపడుతున్నా కనీసం పట్టించుకోకపోవడం దారుణమని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల గౌరవ అధ్యక్షుడు టి.తిరుపతిరావు, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు, వై.శ్యామలరావు, ఆర్.సతీష్ అన్నారు. శ్రీకాకుళం నగరంలో ఆదివారం మున్సిపల్ కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి మీదుగా అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడ మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. లేనిపక్షంలో ఆమరణ నిరాహార దీక్షలకు సైతం వెనుకాడబోమన్నారు. నిరసన కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కార్మికులు, వర్క్ ఇన్‌స్పెక్టర్, కంప్యూటర్ ఆపరేటర్లు, డీపీఓ, సెక్యూరిటీ గార్డులు, పార్క్ వర్కర్లు, గ్యాంగ్ మజ్దూర్, వాటర్ వర్క్స్ వర్కర్లు, ఎలక్ట్రికల్ వర్కర్లు, అటెండర్లు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు



సనపల నారాయణరావు

ఎచ్చెర్ల: సాక్షి టీవీ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాస్‌ను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని దేశ అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా ఆక్షేపించడమే కాకుండా తక్షణమే విడుదల చేయాలని ఆదేశాలు జారీచేయడంపై వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు వంటిదన్నారు. ఇకనైనా పాలకులు బుద్ధి తెచ్చుకుని రెడ్ బుక్ రాజ్యాంగం వదిలి అంబేడ్కర్ రాజ్యాంగం అమలు చేయాలని డిమాండ్ చేశారు. తీరు మార్చుకోకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

మోదీ పాలనతోనే దేశాభివృద్ధి



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును సత్కరిస్తున్న నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం 11 ఏళ్లగా అద్భుతమైన పరిపాలన అందించి దేశాన్ని అగ్రగామిగా నిలిపినట్లు బీజేపీ ఫ్లోర్ లీడర్, విశాఖ ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. మోదీ 11 ఏళ్లపాలన సందర్భంగా శనివారం శ్రీకాకుళంలోని ఓ ఫంక్షన్ హాలులో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో బీజేపీ స్టేట్ సెక్రటరీ రెడ్డి పావని, జిల్లా అధ్యక్షుడు సిరిపురపు తేజేశ్వరరావు, పూడి తిరుపతిరావు, పైడి వేణుగోపాలం, బిర్లంగి ఉమామహేశ్వరరావు, శవ్వాన ఉమామహేశ్వరి, వెంకటేశ్వరరావు, సురేష్‌సింగ్, రాజేశ్వరి, లక్ష్మినారాయణ, చెల్లయ్య పాల్గొన్నారు.

నగరంలో పెరిగిన చోరీలు

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివేకానంద



కరపత్రం విడుదల చేస్తున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలో ఇటీవల కాలంలో దొంగతనాలు, చైన్‌స్నాచింగ్‌లు అధికంగా జరుగుతున్నాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉంటే చాలావరకు నేరాలను అరికట్టవచ్చని డీఎస్పీ సీహెచ్ వివేకానంద అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు అవగాహన పెరిగేలా పోలీసు శాఖ తరఫున కొన్ని సూచనలిస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తున్నామన్నారు. సైబర్ నేరాలకు గురికాకుండా జనాలను అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు. విలువైన బంగారు వస్తువులు, డాక్యుమెంట్లు బ్యాంకు లాకర్లలో పెట్టుకోవాలన్నారు. దూరప్రాంతాలకు విహారయాత్రలకు వెళ్లినప్పుడు పోలీస్‌స్టేషన్‌కు సమాచారమిస్తే ఇంట్లో ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలు అమర్చుతారని చెప్పారు. అపరిచిత వ్యక్తుల కదలికలపై అనుమానం వస్తే 112 నంబర్‌కు తెలియజేయాలని సూచించారు. బైక్ దొంగతనాలు జరగకుండా రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. డిజిటల్ అరెస్టు పేరిట డబ్బులు దోచుకునే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడవద్దని, డిజిటల్ అరెస్టులనేవి లేవని స్పష్టం చేశారు.

శిథిల భవనాలు..
బిక్కుబిక్కుమంటూ విధులు!

- పెచ్చులూడుతున్న లావేరు ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలు
- ఆందోళనలో సిబ్బంది, అర్జీదారులు



లావేరు తహసీల్దార్ కార్యాలయంలో శిథిలమైన శ్లాబ్ బీమ్

ఎచ్చెర్ల: లావేరు మండల కేంద్రంలో తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయ భవనాలు అధ్వానంగా మారాయి. శిథిలావస్థకు చేరడంతో శ్లాబ్‌లు పెచ్చులూడి ముక్కలు కిందపడుతున్నాయి. మండల పరిషత్ కార్యాలయంలో శ్లాబ్‌కు పెచ్చులూడటంతో పాటు వర్షం వచ్చిందంటే కారిపోయి నీరు కార్యాలయంలోకి వచ్చేస్తోంది. తహసీల్దార్ కార్యాలయం మరీ అధ్వానంగా తయారైంది. శ్లాబ్‌లతో, పాటు బీములు కూడా పెచ్చులూడి కిందన పడుతున్నాయి. దీంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఏ సమయంలో పెచ్చులూడి నెత్తిన పడతాయో తెలియని పరిస్థితి నెలకొంది. వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చిన ప్రజలు ఈ కార్యాలయాలను చూసి విస్తుపోతున్నారు. ప్రభుత్వ భవనాలే ఇలా ఉన్నాయంటే మిగతా వాటి పరిస్థితి ఏంటని అంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి భవనాలకు మరమ్మతులు చేపట్టాల సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.



పెచ్చులూడిన లావేరు తహసీల్దార్ కార్యాలయం శ్లాబ్



ఎంపీడీవో కార్యాలయంలో పెచ్చులూడిన శ్లాబ్



ఎంపీడీవో కార్యాలయంలో కారుతున్న వర్షపు నీరు

ఆకాశం..ఆహ్లాదకరం



జి.సిగడాం మండలంలో శనివారం సాయంత్రం మేఘాలు దోబూచులాడాయి. నాలుగు గంటల సమయంలో దట్టంగా మబ్బులు కమ్ముకొని ఆహ్లాదకరంగా కనిపించాయి. కొద్దిసేపటి తర్వాత ఆకాశం వివిధ రంగుల్లో కనువిందు చేసింది.

– జి.సిగడాం

రక్తదాతలు అభినందనీయులు



నైరా కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ గోవిందరావును సన్మానిస్తున్న అధికారులు

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ సెంటర్‌లో ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని శనివారం శ్రీకాకుళం ట్రెజరీ ఉద్యోగులు స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 15 మంది ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.మల్లేశ్వరరావు మాట్లాడుతూ అవసరమైన రోగులకు వెంటనే రక్తం అందించి ప్రాణాలు కాపాడడానికి ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం రక్తదాతలకు రెడ్‌క్రాస్ ప్రతినిధులు కె.శ్రీకాంత్, పి.చైతన్యకుమార్ ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో ట్రెజరీ ఉద్యోగులు డేవిడ్ మాదారపు, బి.ప్రదీప్‌కుమార్, బి.గాంధీ, కె.వరప్రసాద్, ఎస్.సూర్యచంద్ర, కె.సతీష్‌చంద్ర, టి.అనిల్, సీహెచ్ సంతోష్, ఎస్.ఈశ్వరరావు, బి.సాయికృష్ణ, డి.శ్రీరామ్‌కుమార్, బి.శ్రీనివాసరావు, పి.చంద్రశేఖరరావు, సీహెచ్.చంద్రశేఖర్, రెడ్‌క్రాస్ సిబ్బంది గుణాకర్, నర్సింగరావు పాల్గొన్నారు.

రక్తదాతలకు సత్కారం

శ్రీకాకుళం అర్బన్: రక్తదాతలు అభినందనీయులని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్ అన్నారు. ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా లయన్స్ రక్త నిధి కేంద్రంలో మేనేజర్ కొంతం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదాతలు సీహెచ్.అరుణ్‌కుమార్, ఎస్.శివ, ఎం.శరత్ చంద్ర తదితరులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో మదర్స్ లవ్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సుప్రజ రౌత్, సభ్యులు అల్లాడ నవీన్, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ నూతన ఉపాధ్యక్షులు ఉర్లం శివతేజ, బాలు, బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ వందన, లక్ష్మి, నాగరాజు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు సన్మానం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని నైరా వ్యవసాయ కళాశాలలో ఎన్ఎస్ఎస్ పీఓగా పనిచేసిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.గోవిందరావు రక్తదానంపై అవగాహన కల్పించినందుకు గాను శ్రీకాకుళం ప్రభుత్వ మెడికల్ కళాశాల బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ కె.అనిత, అదనపు జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ టి.శ్రీకాంత్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డి.పార్వతి, పరిపాలనాధికారి డాక్టర్ బి.రాజశేఖరరెడ్డి, మెడికల్ ఆఫీసర్ వి.సునీత, దిశా సీపీఎం జి.ఆదిలింగం, గాయత్రీ కాలేజ్ ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



లయన్స్ బ్లడ్‌బ్యాంకులో రక్తదానం చేస్తున్న దాతలు



రక్తదానం చేస్తున్న ట్రెజరీ ఉద్యోగులు